కథానిక

# స్వాభిమానం

ఎస్. యం. సుభాని

"ఇక నావల్లకాదుబాబూ! రేపే పంపిచండి నన్ను, ప్రాణంమీదికి వస్తున్నది..."అన్నది సుభద్ర విసుగు కోపం, వ్యక్తంచేస్తూ.

కృష్ణమూర్తి ఏం మాట్లాడకుండా అలాగే వాలుకుర్చీలో కూర్చుని పైకప్పుకేసి చూస్తూ ఏదో ఆలోచిస్తున్నాడు. ఆమె విసుగుకు, కోపానికి కారణం అతనికి తెలుసు. అతని మనసుకుకూడా బాధగానేవున్నది. కాని, ఏమిచేయలేక సతమతమవుతున్నాడు.

"ఏం వినిపించిందా లేదా? రేపే పంపించండి.." అన్నది మళ్ళా, స్థాయికొంచెం హెచ్చించి.

"వినిపించింది...అలాగే రేపుప్రొద్దున మెయిలుకు వెళ్ళు" అన్నాడు కృష్ణమూర్తి, పై పంచె బుజాన వేసుకొని బయటికి వెళ్తూ.

సుభద్ర స్వభావం అంత కఠినమైనదికాదు. ఆ సంగతి అతనికి తెలుసు. ఆమె మాటల్లో ధ్వనించే టంతటి మూర్ఖత్వం ఆమె స్వభావంలో లేదు. పరిస్థితుల ఒత్తడికి తట్టుకోలేక, ఆమె అలా తయారయింది. కాస్తకు, కూస్తకు చిరాకు, కోపం కలుగుతున్నై.... మామూలుగా ఉన్న అలవాట్లన్నీ మానుకొని చేతిలో, దమ్మిడి లేకుండాసంసారం నిర్వహించడం ఎంతకష్టమోకృష్ణమూర్తి స్వయంగా చూస్తునే ఉన్నాడు. పరిస్థితులలా ఏర్పడినందుక తను లోలోపల బాధపడ్తూనే శాయశక్తులా వాటి నెదుర్కొనేందుకు ప్రయత్నిస్తున్నాడు.

అతని ఉద్యోగంపోయి ఏడెనిమిది నెలలు కావస్తున్నది. అంతవరకు మినహాయించగలిగిన పైకంతోను మిత్రులదగ్గర తీసుకొన్న దానితోనో ఎలాగో నెట్టుకురాగలిగాడు. ఇప్పుడు మరీ దుర్భరంగా కనిపిస్తున్నది. సన్నిహిత పరిచయమున్న వాళ్ళందరి దగ్గర కొద్దోగొప్పో పుచ్చుకున్నాడు. సామాన్య పరిచయమున్న వాళ్లని అడిగేందుకు ఏదో బాధగా సంకోచంగా ఉంటున్నది. సుభద్రను వాళ్ళన్నయ్య యింటికి పంపాలంటే ఎంతలేదన్నా ఒక ఏబై రూపాయలు కావాలి. ఎంత ఆలోచించినా అతనికి మార్గం కన్పించలేదు. ఇకవేరే గత్యంతరం లేక పోయేటప్పటికి రాఘవరావు దగ్గరకు వెళ్ళాడు.

రాఘవరావుకు కృష్ణమూర్తికిఉన్న పరిచయమటువంటిది. అప్పటికే దాదాపు నాలుగువందలు తీసకొని వాడుకొన్నాడు. మళ్ళా ఏమని అడగటమో అతనికి అర్థంకాలేదు.

అతని ముఖభావాల్ని చూస్తూనే సంగ్రహించాడు రాఘవరావు. అతని సంకోచాన్ని కూడా గమనించాడు. కాని అతను చేయగ గిందేమో కన్పించలేదు. చేతిలో ఉన్నంతవరక సర్దగలిగాడు. ఏ లక్షాధికారిలాంటివాడో అం ఉంటే ఒకనోట్లకట్ట అతని జేబులో పడవేసి చిర నవ్వుతో సాగనంపగలిగేవాడు. కాని, ఆశయాల ఆదర్శాలు ఉండేవాళ్ళకు అవకాశాలు ఉండవ చాల తక్కువ.

"ఏమాత్రం కావాలిరా?" అని అడిగాడు మం హాసం చేస్తూ.

"మా వదినవాళ్ళన్నయ్య యింటికి వెళ్ళాల కూర్చున్నది..." అన్నాడు కృష్ణమూర్తి. అత మాటల్లోనే అతని బాధ వ్యక్తమవుతున్నది.

"అదేమిటి! ఇప్పుడెందుకు?" కొంచెం ఆశ ర్యంగానే అడిగాడు రాఘవరావు.

అతనికి తెలిసినంతవరకు సుభద్ర యిప్పుడ వాళ్ళన్నయ్య యింటికి వెళ్ళవలసిన ప్రత్యేక అవక మేమీలేదు. ఏ కారణం లేకుండా ఆమెవెళ్లాల కొన్నదంటే అతనికి ఆశ్చర్యంగానే కన్పించిం ప్రస్తుత పరిస్థితి ఎలా ఉన్నదో ఆమెకు తెలియని కాదు. అయినా, ఆమె వెళ్ళానుకోవటం ఎందుక అర్థంకాలేదు.

కృష్ణమూర్తి తలెత్తి ఒకసారి రాఘవరావువైపు చూశాడు. ఆ చూపులో యిమిడివున్న భావాలు అతను మళ్ళా ప్రశ్నించవలసిన అవసరం లేకుండా చేసినై.

అతనిని అక్కడే కూర్చోపెట్టి రాఘవరావు ఒకఅరగంటలో ఏభైరూపాయలు తెచ్చిఇచ్చాడు. ఏడవలేక నవ్వుతున్నట్లు, బాధగా మందహాసం చేస్తూ ఆ డబ్బు తీసుకుని బయలుదేరాడు కృష్ణమూర్తి.

సుభద్ర కోరినట్లుగానే మర్నాడు తెల్లవారు గామున ఆమెను, పిల్లవాడిని, బండెక్కించాడు. బండెక్కి కూర్చున్న తరువాత స్త్రీ సహజమైన గొంతుతో—"మీరుకూడా రండి..." అన్నది సుభద్ర.

"జాగ్రతగా వెళ్ళు." అన్నాడతను. ఆమె తిప్పింది వినపడనట్లు అటువైపుచూస్తూ.

"మీరుకూడా రారాదూ! పోయివద్దాం..." అన్నదామె మళ్ళా! అతనివైపుచూస్తూ.

కృష్ణమూర్తి ఒక క్షణం నిశ్శబ్దంగా ఉండి—నేనెలా వచ్చేది సుభద్రా? ఉద్యోగం పోగొట్టు కుని మీ అన్నయ్య యింట్లో కూర్చుని మను ముపు గుడిచేదా!" అన్నాడు మందహాసంచేస్తూ.

అతను మందహాసం చేసినా అతని మాటల్లో ధ్వనించిన వ్యంగ్యానికామె రుసరుసలాడింది. తన మాటను అతనెప్పుడూ లక్ష్యపెట్టలేదనిపించింది. ఆంతటితో ఆమె ఉదాసీనంగా ముఖం తిప్పు కున్నది.

పరిస్థితుల ప్రాబల్యానికి చింతిస్తూ కృష్ణమూర్తి తిరిగి వచ్చాడు. సుభద్ర వెళ్ళటాన్ని గురించి ఆలోచిస్తే అతని హృదయం బరువెక్కినట్లనిపిం చింది. సుభద్ర సహజంగా ఎంతమంచిదో అతనికి తెలుసు. పరిస్థితులను గుర్తించి తదనుకూలంగా సర్దుకొనిపోయే శక్తి లోపించటంవలన ఆమెఅలా మారయింది. అప్పటికే ఆమెలోని మంచితనం మరుగుపడిపోయింది. ఇంకా కొంతకాలం ఉంటే ఆమె ఎలా మారిపోతుందోననే భయం అతనిని వ్యాకుల పరుస్తుండేది. ఆమె వెళ్ళిపోవటంవలన చెప్పలేనంత బాధ కలిగినా ఒకందుకు కొంత మంచిదే ననిపించింది.

ఏ కష్టాలనైతే ఆమె ఎదుర్కోలేక అభిమాన పడి వెళ్ళిపోయిందో ఆ కష్టాలను ఎలా అంతమొం దించటమా అనేదే అతని ఆలోచన. పరిస్థితులు రానురాను దుర్భరమవుతున్నై. ఈ పరిస్థితులనెలా ఎదుర్కోవటమో అతనికి అర్థం కావటంలేదు. ఈ ఆలోచనలోపడి దైనికావసరాల్ని కూడా అంతగా పాటించేవాడు కాడు. ఆలోచించి ఆలో చించి తల వేడెక్కేది. ఒక్కొక్కప్పుడు కణతలు పగిలిపోతవేమో ననిపించేది. తలమీద చన్నీళ్ళు చల్లుకొని, కళ్లుమూసుకొని వాలుకుర్చీలో పడు కొనేవాడు. మళ్ళా అవే ఆలోచనలువచ్చి ఆలము కొనేవి. పిచ్చెక్కినట్లు లేచి గబగబా బయటికెళ్ళి పోయేవాడు.

రెండువారాల తరువాత సుభద్ర దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. ఖర్చుకు కొంత డబ్బు పంప మని వ్రాసింది. మొదట అతనికి కోపం వచ్చింది. కాని ఆ మరుక్షణానే తన అసమర్థత తల్చుకొని అసహ్యించుకొన్నాడు...ఆమె పెరిగిన వాతా వరణం అలాంటిది. మిధ్యాభిమానం, మిడిసిపాటు ఎక్కువ. ఈ క్లిష్టపరిస్థితులవలన ఉన్న విచక్షణ కూడా పోయింది. కొంచెమైనా ఆమె సమంజ సంగా వ్యవహరించి ఉంటే బాగుండేదనుకున్నాడు. ఆలోచించినకొద్దీ ఆమె అసంగత ప్రవర్తనకు అతని మనసు క్షోభించ సాగింది.

ఆమెకు డబ్బులు యెలాపంపటమో అతనికర్థం కాలేదు. ఈ ఆలోచన, ఈ మనోవ్యథే అతనిని ఎంతగా క్రుంగదీసినవో తను గుర్తించలేక పోతు న్నాడు. పరిష్కారమార్గం లభించక పోయినా ఎప్పుడూ ఆలోచిస్తూండేవాడు. దీని ప్రభావం అతని మనసుమీదేకాక శరీరంమీదకూడా పని చేస్తుండేది.

సుభద్ర ఉన్నంతవరకు వేళకు తిండన్నా తింటూండేవాడు. ఇప్పుడతనినిగురించి పట్టించుకొనే వాళ్ళుకాని, ఆలోచించేవాళ్ళుకాని ఎవరూ లేక పోయారు. క్యాంపునుండివచ్చిన రాఘవరావు అతనిని చూసి ఆశ్చర్యపోయాడు. కుర్చీలో పడు కొని, బాధగా శ్వాస బిగపట్టి వదుల్తున్న కృష్ణ మూర్తిని చూస్తుంటే అతనికెంతో విచారం కలిగింది. రాఘవరావు అతని నుదుటిపైన చేయి వేసి చూశాడు. మండిపోతున్నది. సుభద్రకు

ఉత్తరం వ్రాస్తానన్నాడు. కాని కృష్ణమూర్తి అక్కరలేదని నివారించాడు.

రాఘవరావుకి ఏంచేయాలో అర్థంకాలేదు. క్రమంగా కృష్ణమూర్తికి జ్వరం ఎక్కువయింది. రాఘవరావు అతనిని తనయింటికి తీసుకొనివెళ్లాడు. డాక్టరువచ్చి చూసి టైఫాయిడన్నాడు. కృష్ణమూర్తి స్థితి చూస్తుంటే రాఘవరావుకీ, అతని భార్య అనూరాధకు విచారం ముంచుకొనివచ్చింది. మళ్ళా రాఘవరావు సుభద్రకు ఉత్తరం వ్రాస్తానన్నాడు. కృష్ణమూర్తి వద్దంటూ తనను జనరల్ హాస్పిటల్లో జేర్పించమన్నాడు. అతని మాటలకు రాఘవరావు చాల నొచ్చుకున్నాడు. కాని ఏం మాట్లాడలేదు. డాక్టరువచ్చి ఇన్‌జక్షన్లు యిస్తూనే ఉన్నాడు.

కృష్ణమూర్తి స్థితి మరీ దిగజారి పోయింది. జ్వరం నూటనాలుగు వరకు ఉంటున్నది. అతనికి స్పృహకూడ సరిగా ఉండటంలేదు. రాఘవరావు అనూరాధ ఎటువంటిలోటు లేకుండా చూస్తున్నారు. కాని అతని జ్వరం తగ్గేట్లుగా కన్పించటం లేదు. ఒకరోజు కృష్ణమూర్తి పిచ్చిపిచ్చిగా మాట్లాడటం మొదలు పెట్టాడు. రాఘవరావు ధైర్యం తగ్గిపోతున్నది. ఇటువంటి స్థితిలోకూడా సుభద్రకు తెల్పకుండా ఉండటం అధర్మమనిపించింది. వెంటనే ఉత్తరం వ్రాశాడు.

ఉత్తరం చూసిన వెంటనే బయలు దేరింది సుభద్ర. కృష్ణమూర్తి వెళ్ళేటప్పుడామెకిచ్చిన పైకంలో ఆమెదగ్గరేమీ మిగలలేదు. ఆమెదగ్గరున్న పైకంలో కొంత ఖర్చయింది. ఒక్కయిరవై రూపాయలుమాత్రం మిగిలినై. ఖర్చులకు బొటాబొటిగ సరిపోతుంది. వచ్చేటప్పుడు ఖర్చులకని ఆమె వాళ్ళన్నయ్యనడగనూలేదు, అతనంతట అతను యివ్వనూలేదు. కృష్ణమూర్తి ఉద్యోగం పోయిన సంగతి గాని, ఇప్పుడతనికి జబ్బుగా ఉన్న సంగతిగాని ఆమె వాళ్ళన్నయ్యకు తెలయనివ్వలేదు. ఆమె అభిమానం అటువంటిది.

ఒంట్లో అస్వస్థతగాఉంటే ఇంతకాలం తనకు తెలియచేయకుండా ఎక్కడో స్నేహితులయింట్లో పడిఉండటం అనుచిత మనిపించిందామెకు. వెళ్ళిన వెంటనే భర్తను తమయింటికి తీసుకొని వెళ్ళాలనుకొన్నది. కాని కృష్ణమూర్తి స్థితి చూడగానే ఆమె నిలుచున్నచోటనే స్తంభించి పోయింది. కళ్ళ వెంబడి నీళ్ళు కారసాగినై!

చేతికున్న బంగారపు గాజుల్లో రెండు జతలు తీసి అనూరాధకిచ్చి అమ్మించమన్నది. అనూరాధ ఎంతచెప్పినా ఆమె వినిపించుకోలేదు. అనూరాధ రాఘవరావుతో చెప్పింది.

"ఇంకా నేను చనిపోలేదమ్మా వదినా...నీవు నన్నెంత పరాయివాడిగా భావించినా వాడికంటె ఆత్మీయుడు మరొకడు లేడునాకు. అభిమానంతో యిప్పుడు నీవేం చేయాలనుకొంటున్నావో ఇప్పుడు గుర్తించకపోవచ్చు. కాని గుర్తించినప్పుడు మాత్రం తప్పక పశ్చాత్తాప పడ్తావు." అన్నాడు రాఘవరావు బాధగా.

సుభద్ర మళ్లా ఏం మాట్లాడలేదు. క్షణమొకయుగంగా గడుస్తున్నట్లనిపించిందామెకు. ఇరవైనాలుగ్గంటలూ అలాగే మంచంపక్క కూర్చునేందుకు ప్రయత్నించేది. అనూరాధ బలవంతంగా ఆమెకు విశ్రాంతినిచ్చి అప్పుడప్పుడు తానుకూర్చుంటుండేది.

ఇరవైరోజులవరకు అతనిజ్వరం తగ్గలేదు. సరిగా ఇరవైఒక్కటవరోజున తగ్గింది. ఆరోజే కృష్ణమూర్తి సుభద్రనుచూసి మందహాసం చేసేందుకు ప్రయత్నించాడు. రెండురోజులుంచి సుభద్ర కృష్ణమూర్తిని తమయింటికి పిల్చుకొని వెళ్ళింది.

కిటికీదగ్గర వేసిఉన్న మంచంపైన పడుకొని ఎదురుగా కన్పిస్తున్న కొబ్బరి చెట్టువైపు చూస్తు సుభద్ర ఒల్చి పెట్టిన పళ్లుతింటున్నాడు కృష్ణమూర్తి కొబ్బరి మట్టల్లో ఎక్కడో కూర్చొని ఒక చిలుక అరుస్తున్నది.

"అన్నాళ్ళు తెలియచేయకుండా ఎందుకూరకొన్నారు? ఏం రాతిగుండె కలవారండి మీరు!" అన్నదామె. ఆమె కంఠంలో ఇంకా అభిమాన ధ్వనిస్తూనే ఉన్నది.

కృష్ణమూర్తి ఏంమాట్లాడలేదు. పళ్ళుతినట పూర్తిగాచేసి. ఆ వైపుచూసి ఒక మందహాస చేశాడు.

"చెప్పరేం! మీ మగవాళ్ళంతా యింతే.. అనవసరంగా ఆడవాళ్ళను ఏడ్పిస్తారు." అన్నదామె గోముగా, అతని తలవెంట్రుకల్లో వేళ్ళుపోనిచ్చి దువ్వుతూ.

"నిరుద్యోగిగా నేననుభవిస్తున్న కష్టాలలో పాలు పంచుకోవటం యిష్టంలేక వెళ్ళిపోయావు అటు వంటప్పుడు మళ్ళా..."

"చాల్లెండి...మీరుమాత్రం తక్కువ చేసిం దేమిటి? అంతమాత్రానికే యిటువంటి శిక్షవిధిం చారు. భగవంతుడి అనుగ్రహం సాయందుండబట్టి" ఆమె కంఠం రుద్ధమైంది. కళ్ళలో నీళ్ళు నిల్చినై.

"సుభద్రా..." అన్నాడతను ఆమెచేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"ఇక ఎప్పుడూ అలా చేయరు కదూ!" అన్న దామె ప్రాధేయపూర్వకంగా, అతని కళ్ళలోకి చూస్తూ.

కృష్ణమూర్తి అలాగే ఆమె చెయ్యి తనచేతిలో ఉంచుకొని ఆలోచిస్తున్నాడు. ఇంతవరకు కష్టాల వలన అంతర్భూతంగా ఉన్న మమత పెల్లుబికిం నామెలో. ఈవిపత్తు కలగకుంటే బహుశా అది యిప్పట్లో బయటపడేది కాదామో!

"చెప్పరేం, మళ్ళా ఎప్పుడూ ఇలా చేయరు కదూ?" అన్నదామె. ఆమె స్వరంలో ఎంతో మార్దవం ఉన్నది.

"నీవలా వెళ్ళిపోతే ఈసారి అసలు బ్రతకను సుభద్రా..." అన్నాడతను ఏదో అర్థంకాని బాధతో.

"ఛీ, ఏమిటా మాటలు." అని మందలించిం దామె.

"నిజం సుభద్రా, నీవు లేకుంటే నేను బ్రతక లేను...ఇంకా కొన్నాళ్ళు గడిస్తే ఏమయ్యేదో! నీవు ప్రక్కనుంటె ఎన్ని కష్టాలనైనా ఎంత దు:ఖా న్నైనా సహించకలను...కాని, నీవు లేకపోతే ఏమైపోతానో. ఎప్పుడూ అలా విడిచిపెట్టి వెళ్ళి పోవుకదూ!" ఏదో దిగులు, ఏదో ఆవేదన అతని మాటల్లో ధ్వనిస్తున్నది. ఆమె చేతిని తన చెంపకు తాకించుకొని ఉన్న అతని కళ్ళల్లో నీళ్లు నిల్చినై.

సుభద్ర మనసు చలించిపోయింది. ఎప్పుడూ గంభీరంగా ఉండే కృష్ణమూర్తి ఇంత విహ్వలంగా మాట్లాడడం ఆమెను చకితపర్చింది. అతనామెను ఎంత ప్రేమిస్తున్నాడో ఆమెకు తెలుసు; కాని యింతగా అతని హృదయం తన మనసును పెన వేసుకొని ఉన్నట్లు ఆమె ఇంతవరకూ గ్రహించ లేదు. ఈనాడామె ఆతనిని గుర్తించింది. సంతోషంతో ఆమె మనసు పులకించింది.

"ఇంకానా, మీరు విధించిన శిక్ష మర్చిపో గలనా!" అన్నదామె ఆనందంగా మందహాసం చేస్తూ.

"అది శిక్షకాదు సుభద్రా, నీవు కష్టపడ్డావనే తెలియచేయలేదు...ఆ భావం ఒకప్పుడు నువ్వే కలిగించావు. మళ్ళా యిప్పుడు నువ్వే తప్పుని నిరూపించావు. నీకు శిక్షవిధించి నేనేమవాలి సుభద్రా.." అన్నాడతను. ఇంకా అతని కంఠంలో విహ్వలత స్ఫురిస్తూనే ఉన్నది.

అతని కనుకొలకుల్లో నిల్చిన కన్నీటి బిందువుల్ని తుడిచి, అతని తల నిమురుతూ కూర్చున్న సుభద్ర ముఖం వింత దీప్తితో శోభించింది.

రెప్పవేయకుండా అలాగే ఆమె వైపు చూస్తు పడుకొని ఉన్న కృష్ణమూర్తికి ఆమెలో పూర్వపు అభిమానంకాని దర్పంకాని ఉన్నట్లనిపించలేదు. ఆమె ముఖాన శోభిస్తున్న వింత తేజాన్ని చూస్తుంటే అతని కళ్ళు మిలమిల మెరసినై.

---

ఇద్దరు స్త్రీలు మాటాడుకుంటున్నారు: "ఔను. మొదటిసారి చూడగానే మావారిని నేను అమితతీవ్రంగా ప్రేమించాను" అని ప్రారంభించిం దొకావిడ, 'ఇప్పటికీ నాకు నిన్న జరిగినట్టు జ్ఞాపకం ఉంది. నేనూ, మా నాన్నా వీధంట నడుస్తున్నాం. హఠాత్తుగా మా నాన్న 'వారిని' చూపించి 'అదుగో అమ్మాయీ! ఆ నడుస్తున్నతణ్ణి చూడు, లక్షరూపాయల ఆస్తిపరుడు!" అన్నాడు.